www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | శని వారం 11 జూన్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-86 | పేజీలు - 4 వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# మహిళా దర్బార్



## ఆడవాళ్లను ఆదుకునేందుకు బలమైన శక్తిగా ఉంటా

### ఆడపడుచులు బాధపడుతుంటే చూడలేను - గవర్నర్ తమిళిసై

**తెలంగాణ ఆడపడుచులు బాధ పడుతుంటే తాను చూడలేను. వారికి తోడుగా ఎప్పుడూ ఉంటానని భరోసా ఇస్తున్నాను. మహిళలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. తెలంగాణ మహిళలు సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నాను.**

– తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** మహిళలు ఇబ్బంది పడుతుంటే తాను చూస్తూ ఉండలేనని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. ఆడవాళ్లను ఆదుకునేందుకు తాను ఎల్లప్పుడు బలమైన శక్తిగా ఉంటానని తెలిపారు. హైదరాబాద్ రాజ్ భవన్ లో 'మహిళా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తమిళిసై మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడానికే రాజ్ భవన్ ఉందని స్పష్టం చేశారు. మహిళలు బయటకు చెప్పుకోలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, వారు తమ సమస్యలు



చెప్పుకోవడానే రాజ్‌భవన్‌లో మహిళా దర్బార్ ఏర్పాటు చేశానని తెలిపారు. బాధితుల స్వరాన్ని ప్రభుత్వానికి వినిపిస్తానన్న తమిళిసై.. మహిళ బాధపై స్పందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఆడవారు బయటకు చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్న అంశాలపై చర్చించారు. 'గవర్నర్ ప్రజలను కలుస్తారా అని చాలా మందికి అనుమానాలున్నాయని అయితే ప్రభుత్వ కార్యాలయమైన రాజ్‌భవన్ ఉంది ప్రజల కోసమే అని స్పష్టం చేశారు. వారి సమస్యలు విని, వాటిని పరిష్కరించడానికే. కరోనా సమయం లోనూ నేను రోగులను పరామర్శించానన్నారు. సమాజంలో మహిళలు ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని తమిళిసై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. . ఇంట్లో, పనిచేసే చోట, పాఠశాలల్లో, కాలేజీల్లో, రోడ్లపైన ఇలా ప్రతిచోటా ఆడపిల్లలు వేధింపులు ఎదుర్కొంటున్నారు. చాలా మంది వాటి గురించి ఇంట్లో వాళ్లకు చెప్పుకోలేక.. వేధింపులు

2

## నేడు ఖమ్మం పర్యటనకు మంత్రి కెటీఆర్

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

భారీగా ఏర్పాట్లు చేస్తున్న టిఆర్ఎస్ శ్రేణులు



**ఖమ్మం, జూన్ 10 (సమ సమాజం):** ఖమ్మం జిల్లాలో మంత్రి కెటిఆర్ శనివారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి జిల్లా పర్యటన అధికారికంగా ఖరారైంది. ఆయన శనివారం పట్టణంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్స వాలకు శ్రీకారం చుడతారు. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి ఖమ్మం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి రూ. 86కోట్లకుపైగా నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఉదయం 8గంటలకు మంత్రులు కేటీఆర్, పువ్వాడతో పాటు పలులురు నేతలు, ప్రజాప్రతినిధులు హెలికాప్టర్‌లో ఖమ్మం చేరుకుని ఖమ్మం మమతా ఆసుపత్రి గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం లకారం ట్యాంక్‌బండ్‌పై సస్పెన్షన్ కేబుల్‌బ్రిడ్జి, మ్యూజికల్‌లైటింగ్,

2

## టెట్ వాయిదా వేయండి–రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** టెట్ పరీక్షను వాయిదా వేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 12న టెట్ తో పాటు ఆర్ఆర్‌బీ పరీక్ష ఉండటంతో ఉద్యోగార్థుల భవిష్యత్తు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే రెండు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గందరగోళంలో ఉన్నారని శుక్రవారం ట్విట్టర్ ద్వారా రేవంత్ రెడ్డి తెలిపారు. మరోవైపు టెట్, ఆర్ఆర్‌బీ అభ్యర్థులు ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి పలుమార్లు విన్న వించుకున్నారు. అయినా స్పందన లేక పోవడంపై అభ్యర్థులు ఆందోళన చెందు తున్నారు.

## కేసీఆర్ పతనం ప్రారంభమైంది : బండి



**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ పతనం ప్రారంభమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆర్టీసీ ఛార్జీల పెంపుపై జేబీఎస్‌లో ప్రయాణికులతో ముఖాముఖి నిర్వహించేందుకు బండి సంజయ్ బంజారాహిల్స్ నుంచి జేబీఎస్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎందుకు హౌస్ అరెస్ట్ చేస్తున్నారో అర్థం కాలేదన్నారు. రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని... అరెస్ట్‌లు, జైళ్లకు భయపడమని స్పష్టం చేశారు. ఆర్టీసీ చార్జీలు పెంచితే ప్రశ్నించకూడదా? అని నిలదీశారు. అర్ధరాత్రి జిట్టాను అరెస్ట్ చేయటాన్ని ఖండిస్తున్నానన్నారు. ఉద్యమకారులను అరిగోసా పెడుతున్నారని, ద్రోహులను సంకన వేసుకొని తిరుగుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఆర్టీసీ ప్రయాణీకులతో మట్లాడేందుకే జూబ్లీ బస్టాండుకు వెళ్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు. అంతకు ముందు జేబీఎస్ పేరుతో డీజీపీ కార్యాలయం ముట్టడికి వెళ్తారన్న అనుమానంతో సంజయ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అర్ధరాత్రి బీజేపీ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి ని ఘట్ కేసర్ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. జూన్ 2న అమరుల యాదిలో ఉద్యమ ఆకాంక్షల సాధన సభ నిర్వహించారు. ఈ సభలో సీఎం కేసీఆర్‌పై స్కిట్ చేసి అగౌరవపరిచారంటూ జిట్టాపై కేసు నమోదైంది. దీంతో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. జిట్టాను అరెస్టు చేయటాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ డీజీపీ కార్యాలయం ముట్టడికి వెళ్తారన్న అనుమానంతో ముందస్తుగా ఆయనను హౌస్ అరెస్టు చేశారు.

## రాష్ట్రపతి ఎన్నికపై కెసిఆర్ సమీక్ష

### జాతీయ పార్టీ పెట్టాలని కేసీఆర్ నిర్ణయం ? ▪ మంత్రులు, ఎమ్మెల్యేల హాజరు

**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** రాష్ట్రపతి ఎన్నికల అంశంపై సీఎం కేసీఆర్ భేటీ అయ్యారు. ఈ సమావేశానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరైనారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిలు కూడా ఈ భేటీలో పాల్గొనడం విశేషం. రాష్ట్రపతి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పై చర్చించినట్లు సమా చారం. అంతేకాకుండా దేశంలో తాజా రాజకీయాలపై కూడా కేసీఆర్ చర్చించినట్లు తెలుస్తోంది. జూలై 25తో రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ పదవీకాలం ముగియనుండడంతో ఈ లోపు రాష్ట్రపతి పదవికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.



ఈ నేపథ్యంలోనే టీఆర్ఎస్, ఇతర పార్టీల్లో రాష్ట్రపతి ఎన్నికలపై చర్చ జరుగుతోంది. కానీ.. కేసీఆర్ మాత్రం ఎలాంటి ప్రకటనలు చేయడం లేదు. టీఆర్ఎస్ తటస్థంగా ఉండి పోతుందా? లేక ప్రత్యామ్నాయ కూటమిని ఏర్పాటు చేసి, ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దించడానికి కేసీఆర్ వ్యూహాన్ని పన్ను తున్నారా? అని చర్చించినట్లు తెలుస్తోంది. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థికి టీఆర్ఎస్ మద్దతిచ్చే అవకాశమే లేదని ఆ పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు. కేసీఆర్ జాతీయ స్థాయి పర్యటనలు చేపడుతూ విపక్షాలను కూడగడుతున్నది ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్ట డానికేనని అంటున్నారు. ప్రస్తుతం ఆయన దీనిపైనే వ్యూహ రచన చేస్తున్నారని పేర్కొంటున్నారు.

## మరోసారి ముంచుకొస్తున్న కరోనా ముప్పు


### కరోనాపై తెలంగాణ ప్రభుత్వం తాజా హెచ్చరిక





**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్నాయని.. అయితే ఆందోళన అవసరం లేదని అంటున్నారు తెలంగాణ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు. ప్రస్తుతం రాష్ట్రంలో కొత్త కరోనా కేసులు నమోదు అవుతున్నా.. ఆస్పత్రుల్లో చేరికలు లేవని, మరణాల సంఖ్య కూడా సున్నాగా ఉందని హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు చెప్పారు. కేసుల పెరుగుదలపై ఆందోళన నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ తరపున శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో గత వారం 355 కేసులు నమోదు అయ్యాయి. ఈ వారంలో 555 కేసులు నమోదు అయ్యాయి. రాష్ట్రంలో సుమారు 56 శాతం కేసుల పెరుగుదల నమోదు అయ్యింది.

2



**న్యూ ఢిల్లీ, జూన్ 10 (సమ సమాజం):** కరోనా మహమ్మారి మళ్లీ వచ్చేస్తోంది. తగ్గినట్లే తగ్గి చాపకింద నీరులా విస్తరిస్తోంది. జనం మాస్క్, శానిటైజర్లు, భౌతిక దూరం వంటి జాగ్రత్తలను పూర్తిగా విస్మరించారు. పబ్బులు, క్లబ్బులు, విందులు, వినోదాలు, తీర్థయాత్రలు, విహార యాత్రల్లో మునిగితేలుతున్నారు. అడ్డూ అదుపు లేని ప్రయాణాలు, ఒకే చోట వేలాదిమంది గుమిగూడటం వంటి చర్యలతో వైరస్ మరోసారి వణికిస్తోంది. భారత్‌లో గడిచిన 24 గంటల్లో ఏడు వేలకుపైగా కోవిడ్ కేసులు నమోదయ్యాయి. తాజాగా 7,584 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గడిచిన మూడు నెలల్లో ఇంత భారీగా కేసులు వెలుగు చూడటం ఇదే తొలిసారి.

2

## భవిష్యత్ తరాల కోసం 'దక్కని' గొర్రెల పెంపకం: హరీశ్ రావు



**సిద్దిపేట, జూన్ 10 (సమ సమాజం):** అధిక రోగనిరోధక శక్తి కలిగి ఉండటంతో పాటు రుచికరమైన, అధిక పోషక విలువలు కలిగిన దక్కని గొర్రెలను అధిక సంఖ్యలో పెంచి భవిష్యత్ తరాలకు అందించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి క్లస్టర్ రైతు వేదికలో గొర్రెలకు నట్టల నివారణ మాత్రలు వేసి.. దక్కని జాతి గొర్రెల అభివృద్ధి పథకం లబ్దిదారులు, క్షేత్ర సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..జిల్లా ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన దక్కని గొర్రెల మాంసాన్ని అందించేందుకు సిద్దిపేట పట్టణంలోని నాన్‌వెజ్ మార్కెట్లో రెండు స్టాళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. మిట్టపల్లి గ్రామానికి చెందిన గొల్ల, కురుమలు

2

## నీట్–పీజీ 2021 ఖాళీ సీట్ల భర్తీకి మరో కౌన్సిలింగ్ లేదుః సుప్రీం

న్యూఢిల్లీ, జూన్10 (ఆర్ఎన్ఏ): నీట్–పీజీ 2021 ఆలిండియా కోటాలో ఖాళీ సీట్లను భర్తీ కి ప్రత్యేక స్టే రౌండ్ కౌన్సెలింగ్ ను కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఇప్పటికే 8–9 రౌండ్లు జరిగాయని, మరోసారి కౌన్సెలింగ్‌ను నిర్వహించరాదని తీసుకున్న నిర్ణయం నిరంకుశంగా తీసుకున్నది కాదని, వైద్య విద్య, ప్రజారోగ్యాల ప్రయోజనాల కోసమేనని న్యాయస్థానం వివరించింది. కేంద్ర ప్రభుత్వం, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ స్టే రౌండ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించరాదని నిర్ణయించినపుడు, దానిని నిరంకుశ చర్యగా పరిగణించలేమని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ అనిరుద్ధ బోస్ ధర్మాసనం తెలిపింది. 2022 మే 7న జరిగిన కౌన్సెలింగ్ అనంతరం దాదాపు 1,456 సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. దీనిపై జస్టిస్ షా మాట్లాడుతూ, ఖాళీ సీట్లు ఉండటం చాలా సంవత్సరాల నుంచి జరుగుతోందని, ఈ ఏడాది మాత్రమే అది కొత్త విషయం కాదని చెప్పారు. ప్రతి కసరత్తుకు ఓ పరిమితి ఉండాలన్నారు. పదో రౌండ్ కౌన్సెలింగ్ తర్వాత కూడా సీట్లు ఖాళీగా ఉండిపోయే అవకాశం లేకపోలేదన్నారు. ప్రజల ఆరోగ్యానికి నష్టంఏడాదిన్నర తర్వాత హక్కులను విద్యార్థులు కోరకూడదని ధర్మాసనం చెప్పింది. ఏడాదిన్నర గడచిపోయిన తర్వాత ప్రవేశం కల్పించాలని, ప్రజారోగ్యానికి నష్టం కలిగించాలని చెప్పగలమా? అని ప్రశ్నించింది. ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ సమర్పించిన అఫిడవిట్‌లో, 2021 ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కోసం ఉపయోగించిన సాఫ్ట్‌వేర్ క్లోజ్ అయిందని చెప్పారు. ఈ పీజీ కౌన్సెలింగ్‌లో పార్టిసిపేట్ చేసినవారికి సెక్యూరిటీ డిపాజిట్‌ను తిరిగి ఇవ్వడం ప్రారంభమైందన్నారు. పిటిషనర్ చాలా ఆలస్యంగా విజ్ఞప్తి చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న నీట్–పీజీ 2022 కౌన్సెలింగ్‌పై దీని ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. రెండు విద్యా సంవత్సరాలకు ఏకకాలంలో కౌన్సెలింగ్ నిర్వహించడం కష్టమవుతుందని చెప్పారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ఇది మూడేళ్ళ కోర్సు అని, విద్య విషయంలో రాజీ పడకూడదని చెప్పింది. ఉదాహరణకు, ఆరు నెలల నుంచి ఆకలితో ఉన్నవారు ఒక రోజులో అంతా తినేయగలరా? అని ప్రశ్నించింది. విద్య కూడా అటువంటిదేనని తెలిపింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ తొమ్మిది రౌండ్ల నీట్–పీజీ 2021ను నిర్వహించింది. వీటిలో నాలుగు రౌండ్లు స్టేట్ కౌన్సెలింగ్, నాలుగు రౌండ్ల ఆలిండియా కోటా కౌన్సెలింగ్, ఒక రౌండ్ ఆలిండియా కోటా కౌన్సెలింగ్ ఉన్నాయి. నీట్–పీజీ 2021 ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ముగిసింది. 1,456 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

## సంపాదకీయం

# అన్నదాతలకు తప్పని పెట్టుబడి ప్రహసనం !

రైతులకు ఏటా పెట్టుబడి ఓ ప్రహసనంగా మారింది. బ్యాంకర్లతో మీటింగ్‌లు పెట్టి లక్ష్యం నిర్దేశించినా అంత సులువుగా రుణం దక్కడం లేదు. ఏటా బ్యాంకర్ల సమావేశంలో లక్ష్యాలు నిర్దేశిస్తున్నా ఆ లక్ష్యాలు చేరుకోవడం లేదు. క్షేత్రస్థాయిలో బ్యాంకర్లు రైతులను పురుగులుగానే చూస్తున్నారు. వారికి రుణాలు ఇవ్వడం అన్నది లక్ష్యంగా ఆలోచించడం లేదు. వానాకాల సీజన్ మొదలు కావడంతో అన్న దాతలు పంట రుణాల కోసం బ్యాంకులకు పరుగులు పెడుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. అధికారుల ముందు తలూపడం తప్ప రుణాలు ఇవ్వడంలో పెద్దగా బ్యాంకర్లు స్పందిం చడం లేదు. ఇది ఏటా జరుగుతన్న తంతే. ఖరీఫ్‌లో వ్యవసాయ రుణాలకు సంబంధించి వార్షిక రుణ ప్రణాళికను ఎపి సిఎం జగన్ విడుదల చేశారు.ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో రుణ పంపిణీ లక్ష్యాలను ఎందుకు చేరుకోలేక పోయామనే విషయంపై బ్యాంకులు దృష్టిపెట్టాలని సూచించారు. సకాలంలో పెట్టుబడి అందించేలా నిర్దిష్ట విధానాలు అమలు కావడం లేదు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నపాలకులు క్షేత్రస్థాయిలో సమస్యలను పట్టించుకోవడం లేదు. ఎంత యంత్రాంగం ఉన్నా అంతా చేష్టలుడిగి చూస్తున్నారు. ఇకపోతే రుణాల చెల్లింపులపై రైతుల్లో అవగాహన లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే ప్రభుత్వ విధి విధానాలు కూడా సక్రమంగా లేకపోవడంతో అన్నదాతల కు నష్టమే జరుగుతుంది. అసలు ఏప్రిల్, మే నెలల్లో నే ఖరీఫ్ రుణాలను అందజేస్తే రైతులు పంటల సాగుకు సన్నద్ధమవుతారు. తొలకరి వర్షాలు కురియగానే సాగు సందడి మొదలవుతుంది. ఇప్పటికే నీటి వసతి ఉన్న చోట్ల విత్తనాలను విత్తుతున్నారు. ఇప్పటి వరకు సరైనా వర్షాలు లేకపోవడంతో సాగు పనులు అంతంత మాత్రంగానే ముందుకు సాగుతు న్నాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. సకాలంలో బ్యాంకర్లు కొత్త రుణాలను చెల్లించక పోవడంతో రైతులకు వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు. ఎక్కువగా దళారులే రైతులకు రుణం అందిస్తున్నారు. కొన్నిచోట్ల 25శాతం వడ్డీ చొప్పున వసూలు చేస్తున్నారు. జిల్లాల్లో ఏటా కొన్ని కోట్ల రూపాయల వరకు దళారులు అక్రమ దందాకు ఎగబడుతున్నారు. కొత్త పంటరుణాల కోసం అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికే అప్పుసప్పు చేసి విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసిన రైతులు పంట రుణాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. రుణంరాగానే అప్పు తీరుస్తామంటూ వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. కొందరు రైతులైతే ఆభరణాలను తాకట్టు పెట్టి మరీ పెట్టుబడులు పెడుతున్నారు. అప్పు చేసే స్థోమత లేని చిన్న సన్నాకారు రైతులు మాత్రం రుణం వచ్చేవరకు సాగు పనుల జోలికి వెళ్లడం లేదు. చేతిలో చిల్లిగవ్వ లేక బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తున్నారు. సకాలంలో రుణం చేతికి వస్తేనే సాగు పనులు ఊపందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక తెలంగాణలో అయితే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పై స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేయనే లేదు.

దీంతో పంట రుణాలు చెల్లించాలా వద్ద అనే సందిగ్ధత కనిపిస్తుంది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈసారి కాకపోయినా వచ్చే సీజన్ లోపైనా పంట రుణాలను మాఫీ చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో దశల వారీగా రుణమాఫీ చేసిన తెలంగాణ ప్రభుత్వం ఈసారి ఏకకాలంలోనే లక్ష రూ పాయల రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేయనే లేదు. అయితే లక్ష లోపు రుణం మాఫీ చేస్తే దాదాపుగా వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ ప్రకటనకు ముందే రుణం చెల్లిస్తే మాఫీ వర్తిస్తుందో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రుణం చెల్లించేందుకు అన్న దాతలు ఊగిలాడు తున్నారు. ఈసారి రుణ పక్రియ మరింత ఆలస్యం కావడంతో వానకాల పంటల సాగుపై ప్రభావం పడుతుంది. దీనికి తోడు పెట్టుబడి సహాయం కూడా ఆలస్యం కావడంతో రైతుల్లో అయోమయం కనిపిస్తుంది. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేందుకు కొంతమంది రైతులు ప్రైవేట్ దళారులను ఆశ్రయించాల్సి వస్తుంది. రెన్యూవల్ కోసం బ్యాంకర్ల ఒత్తిళ్లు పంట రుణాల గడువు సమయం ముగిసి పోవడంతో సంబంధిత బ్యాంకర్లు అన్నదాతల పై ఒత్తిళ్లు చేస్తున్నారు. సకాలంలో పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు. కనీసం వడ్డీ చెల్లించైనా రుణ సొమ్మును రెన్యూవల్ చేసుకోవాలని ఆదేశిస్తు న్నారు. కొన్ని బ్యాంకర్ల ఫీల్డ్ అసిస్టెంట్లు అయితే నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ రుణాలను చెల్లించాలని నేరుగా రైతుల ఇంటికి వెళ్తున్నారు. గ్రామాల్లో పలుకుబడి ఉన్న పెద్దలు, సర్పంచ్‌లతో రైతుల పై ఒత్తిళ్లు తెస్తున్నారు. రుణం తీసుకున్న రోజు నుంచి ఏడాది లోపు తక్కువ వడ్డీ వేస్తున్న ఆ తర్వాత గడువు మించితే అదనంగా వడ్డీ భారం పెరిగిపోతునే ఉంది. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేసిన వడ్డీ సొమ్మును మాత్రం రైతులే చెల్లించాల్సి ఉంటుంది. యేటా రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్న రైతులకు రుణభారం మరింత పెరిగి పోతునే ఉంది. ఇదిగో అదిగో అంటూ ప్రభుత్వం కాలం గడపడంతో ఎన్నికలకు ముందు ఎలాగైనా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్న ధీమాతో రైతులు సక్రమంగా రుణం చెల్లించేందుకు ముందుకు రావడం లేదు.ముందు చూపు కరువు.. వానాకాల సీజన్ ప్రారంభమై వారంరోజులు గడుస్తున్నా రుణమాఫీ పై ప్రభుత్వానికి ముందుచూపు కరువైంది. పంటరుణాల కోసం బ్యాం క్‌లకు వెళ్తే రుణమాఫీపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో రుణాలను రెన్యూవల్ చేసేందుకు రైతులు వెనుకాడుతున్నారు. గతంలో ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశారు. ఈసారి మాత్రం నిబంధనలు ఎలా ఉంటాయోనని అన్నదాతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు చేస్తారో స్పష్టత నివ్వాలని రైతులు కోరుతున్నారు. గ్రామాల వారీగా అధికారులు పరిశీలనచేస్తే రైతుల సమస్యలు తెలుస్తాయి. వ్యవసాయాన్ని పండగ చేస్తున్నామన్న పాలకులు గ్రామాల్లో పరిస్థితులను బేరీజు వేసుకుంటే మంచిది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# రైతుల చుట్టూ రాష్ట్ర రాజకీయాలు

### అందరిదీ రైతు సంక్షేమ నినాదమే□లక్ష్యం నెరవేర్చని సంక్షేమ పథకాలు

**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** తెలంగాణలో ఎన్నికల సమయంలో పథకాలు ప్రకటించాలనుకుంటున్న కాంగ్రెస్,బిజెపిలకు పాలుపోవడం లేదు. ఏం ప్రకటిస్తే ప్రజలను ఆకట్టుకోగలమో కూడా తెలియడం లేదు. ఎందుకంటే ఏ వర్గాన్నీ వదలకుండా సిఎం కెసిఆర్ అన్ని పథకాలు ప్రకటించి అమలు చేస్తున్నారు. కొత్త ఆలోచనలతో విపక్షాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. చివరకు 24 గంటల కరెంట్ ఇస్తున్నారు. మంచినీటి కోసం మిష్ భగీరథ, చెరువుల తవ్వకం అన్నీ అయిపోయాయి. ఇక ఎకరాకు పదివేల సాయం ఇప్పటికే అమలవుతోంది. ఈ దశలో మిగిలివున్న వర్గం ఏదైనా ఉందా ఉంటే వారికి ఏం చేయాలన్న దానిపైనా సమాలోచనలు చేస్తున్నారు. ఈ దశలో 24 గంటల కరెంట్ సరఫరాను వ్యతిరేకించిన కాంగ్రెస్ ప్రజల్లో అభాసు పాలయ్యింది. ఇకపోతే కేంద్రం నుంచి సాయంగా ఒక్కపనీ చేయించలేని బిజెపి కూడా అధికారంలోకి వచ్చేది తామే అని కాలుదువ్వుతోంది. నిజానికి ఇప్పుడున్న సీట్లలో సగం రావడం కష్టమే. అందుకే తమవంతుగా బిజెపిశాఖ రైతు రుణ మాఫీ రేసులోకి దూకింది. తాము అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రూపాయల రుణం మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ అయితే గత ఏడాది కాలంగా ఇదే హామీని రైతుల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఈ హామీలను అధికార టీఆర్ఎస్ కొట్టి పారేస్తుంది. ఒకేసారి రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ సాధ్యంకాదని అధికార పార్టీ చెబుతోంది. అయినా కాంగ్రెస్, బిజెపిలు మాత్రం హామీలతో ముందు కెళ్ళటానికే నిర్ణయించుకున్నాయి. టీఆర్ఎస్ సర్కారు పెట్టుబడి రాయితీ పేరుతో పదివే రూపాయల లెక్కన ఇస్తోంది. బిజెపి తెలంగాణలో విజయబావుటా ఎగరేస్తుందని చెబుతున్నారు. తెలంగాణలో రైతులు కష్టాలపాలు అవుతున్నారని బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శించారు. కేరుణమాఫీ బ్యాంకుల వడ్డీలకే సరిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం చెప్పిన నకిలీ విత్తన చట్టం ఊసే లేదన్నారు. నకిలీ విత్తన కంపెనీలకు టీఆర్ఎస్ సర్కారు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. ఇకపోతే రైతులకు వడ్డీ లేని రుణాలి స్తామని చెప్పారు. మరోవైపు కాంగ్రెస్ కూడా రైతులను నమ్ముకునే పనిచేస్తోంది. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రేవంత్ రెడ్డి అంటున్నారు. కేసీఆర్ వైఫల్యాల మూలంగానే గడిచిన నాలుగేళ్లలో నాలుగు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రైతులెవరూ అధైర్యపడి ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. కమిషన్లకు కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్టు రీ డిజైన్ చేశారని ఆరోపించారు. కేవలం కాంట్రాక్టర్లకు లాభం చేసేందుకు రూ.85 వేల కోట్లకు అంచనాలు పెంచారన్నారు. నిరుపేదల భూములను కేసీఆర్ ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటుందన్నారు. నష్టపరిహారం విషయంలోనూ స్పష్టతేదన్నారు. కుట్రపూరిత ఆలోచనలతో కేంద్రంతో కేసీఆర్ ప్రభుత్వం తటస్థ వైఖరి అవలంబి స్తున్నారని విమర్శించారు. మొత్తంగా అందరికి పథకాలు ప్రకటించాలంటే ఏం చేయాలన్నది ఇప్పుడు అంతుపట్టడం లేదు.

## పరిగిలో ఘోర రోడ్డు ప్రమాదం

**వికారాబాద్, జూన్ 10 (సమ సమాజం):** వికారాబాద్ జిల్లాలోని పరిగి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మండలంలోని రంగంపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున వేగంగా దూసుకొచ్చిన లారీ.. కారును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఒకరు మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. మృతుడిని సుదర్శన్ రెడ్డిగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు ఖమ్మం పర్యటనకు మంత్రి కెటిఆర్

(మొదటి పేజీ తరువాయి..) రఘునాథ పాలెంలో సుడా ఆధ్వర్యంలో నిర్మించిన బృహత ప్లలెప్రకృతివనం, ఖమ్మం టేకులపల్లిలో కేసీఆర్ టవర్స్‌లో నిర్మించిన 240 డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, తెలంగాణ క్రీడాప్రాంగణాన్ని పాఽ్రరంభింస్తారు. ఆతర్వాత 10:45గంటలకు సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పట్టణ ప్రగతి బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం పాతమునిసిపల్‌భవనలో సిటీలైబ్రరీని, ప్రభుత్వాసుపత్రి వద్ద అధునాతనంగా నిర్మించిన ఫుట్‌పాత్‌ప్రాజెక్టు, గట్టయ్య సెంటర్‌లోని కొత్త కార్పొరేషన్ భవనం, దానవాయిగూడెంలో మానవవ్యర్థాల శుద్ధి కర్మాగారాన్ని, ప్రకా?షనగర్‌లో వైకుంఠధామాన్ని ప్రారంభిస్తారు. అక్కడే మురికినీటిశుద్ధి కర్మాగారానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత ధంసలాపురంలో కార్పొరేషన నర్సరీని ప్రారంభిస్తారు. అనంతరం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో భోజనం చేసి 3గంటలకు హైదరాబాద్ తిరుగు పయనమవుతారు. మంత్రి కేటీఆర్ పర్యటన అధికారికంగా ఖరారవడంతో ఇటు గులాబీ శ్రేణులు, అటు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సర్దార్‌పటేల్‌స్టేడియంలో బహిరంగసభ ద్వారా రాబోయే ఎన్నికలకు సిద్ధమన్న సంకేతాలు పంపనున్నారు. బహిరంగసభ జయప్రదం చేసేందుకు జనసమీకరణపై దృష్టిసారించారు. కేటీఆర్ రాక సందర్భంగా ఇల్లెందుక్రాస్‌రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, మమతా సర్కిల్‌తోపాటు ఖమ్మం నగరంలో పలుచోట్ల గులాబీతోరణాలతో అలంకరించారు. ఫ్లెక్సీలు, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. అయితే గతంలో రెండుసార్లు కేటీఆర్ పర్యటన ఖరారై వాయిదా పడడంతో ఈ సారి కచ్చితంగా పర్యటన జరుగుతుందని, ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు టీఆర్ఎస్ నాయకులు కృషిచేస్తున్నారు. ఖమ్మంనగర, రఘునాథపాలెం మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పర్యటన, బహిరంగసభ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

## మరోసారి ముంచుకొస్తున్న కరోనా ముప్ప

(మొదటి పేజీ తరువాయి..) మహారాష్ట్రలో అత్యధికంగా 2,813 మంది కరోనా బారినపడ్డారు. గురువారం కోవిడ్‌తో 24 మంది మృత్యువాతపడ్డారు. ఒక్కరోజే 3,791 మంది కోలుకున్నారు. యాక్టివ్ కేసులు 36,267 ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర వైద్యారోగ్యశాఖ కోవిడ్‌పై శుక్రవారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. దీని ప్రకారం కరోనాతో మరణించిన వారి సంఖ్య 5,24,747కు చేరింది. మొత్తం కేసుల సంఖ్య 4,31,90,282కి పెరిగింది. దేశవ్యాప్తంగా కోలుకున్న వారి సంఖ్య 4,26,44,092కి చేరింది.

## కరోనాపై తెలంగాణ ప్రభుత్వం తాజా హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి..) అలాగే దేశంలో కేసుల సంఖ్య 66 శాతం పెరిగిందని డీహెచ్ వెల్లడించారు. కరోనా పూర్తిగా వెళ్లిపోలేదని, సబ్ వేరియెంట్స్ కొంత ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. వచ్చే డిసెంబర్ వరకు ఇలాగే ఉండే అవకాశం ఉంది. అయితే ఆందోళన అక్కర్లేదు. మాస్క్ ధరించాలి. జాగ్రత్తలు పాటించాలి. జ్వరం, తలనొప్పి, వాసన లేకపోతే కచ్చితంగా టెస్ట్ చేయించుకోవాలి. జాగ్రత్తలు పాటించడం మరీ మంచిది. త్వరలో ఇంటింటికి వెళ్లి వ్యాక్సినేషన్ చేపట్టబోతున్నామని చెప్పారు.

## భవిష్యత్ తరాల కోసం 'దక్కని' గొర్రెల పెంపకం: హరీశ్ రావు

(మొదటి పేజీ తరువాయి..) దక్కని గొర్రెల మాంసాన్ని విక్రయించాలన్నారు. గొర్రెలు ఆరోగ్యంగా పెరిగేందుకు నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 51 బృందాల ద్వారా 8 లక్షల 94 వేల గొర్రెలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తామన్నారు. ఎకరానికి లక్షన్నర నుంచి రెండు లక్షల రూపాయల ఆదాయం ఆర్జించే పామాయిల్ సాగును రైతులు చేపట్టాలని ఆయన సూచించారు. మిట్టపల్లి గ్రామానికి 10 కిలోమీటర్ల దూరంలోనే నర్మెటలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో ఉందన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్స్ ను అందజేస్తాం. ఉచితంగా పామాయిల్ మొక్కలను అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి అధిక దిగుబడి పొందేందుకు రైతులు ముందుగా పచ్చిరొట్టను పండించాలన్నారు. అలాగే పంట మార్పిడి చేయాలి. పట్టు పురుగుల పెంపకం చేపట్టాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బాలరాజు, జిల్లా అదనపు కలెక్టర్ ముజామిల్ ఖాన్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఆడవాళ్లను ఆదుకునేందుకు బలమైన శక్తిగా ఉంటా

(మొదటి పేజీ తరువాయి..) తట్టుకోలేక వారిలో వారే కుమిలిపోతున్నారు. కొన్నసార్లు భరించలేని మనోవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇదంతా ఆపడానికీ, తెలంగాణ మహిళలకు నేనున్నానని చెప్పడానికే ఈ మహిళా దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తనకు ఎదురు చెప్పేవాళ్లను పట్టించుకోనని తమిళిసై వివరించారు. నిరసనకారుల గురించి తాను ఆందోళన చెందడం లేదని, తెలంగాణ మహిళల కోసం వారి శ్రేయస్సు కోసం తన పని కొనసాగుతూనే ఉంటుందని స్పష్టం చేశారు.

## జేబీఎస్‌లో ప్రయాణీకులతో ముచ్చటించిన బండి



**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పోలీసుల వలయాన్ని ఛేదించుకొని జూబ్లీహిల్స్ నుంచి జేబీఎస్ కు వెళ్లారు. బస్టాండ్‌లో కలియతిరుగుతూ ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ‡ూష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీల పెంచి పెనుభారం మోపుతుందని ఆయన ప్రయాణికులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో ఇష్టానుసారంగా ఛార్జీలు పెంచుతూ సామాన్యుడిని నిలువునా దోచుకుంటోందన్న బండి సంజయ్ కుమార్ ఆరోపించారు.

## మానవత విలువలున్న గొప్ప వ్యక్తి రాజా బహదూర్ : పోచారం శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** రాజాబహదూర్ వెంకట్రామి రెడ్డి మానవతా విలువలు కలిగిన వ్యక్తి అని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి కొనియాడారు. తెలంగాణ బిడ్డలు గొప్పగా చదువుకోవాలన్నసహృదయంతో స్వాతంత్య్రం రాకముందే బాలుర పాఠశాల, వసతి గృహాన్ని వెంకట్రామిరెడ్డి ప్రారంభించారన్నారు. రాజాబహదూర్ వెంకట్రామి రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నారాయణగూడలో నూతనంగా నిర్మిస్తున్న బాలికల హాస్టల్ భవనానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి హరీష్ రావు, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్పీకర్ పోచారం గారు మాట్లాడుతూ తెలంగాణ గ్రామాల నుంచి ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వచ్చే విద్యార్థుల కోసం మంచి సౌకర్యాలతో వసతి కల్పించడం గొప్ప విషయమని తెలిపారు. బాలికల వసతి గృహం నిర్మాణం కోసం 1260 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఉచితంగా అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కి పోచారం శ్రీనివాస్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. భవన నిర్మాణానికి ముందుకు వచ్చిన కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కాలేరు వెంకటేశ్, గువ్వల బాలరాజు, టీఎస్ఈడబ్ల్యుఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, రెడ్డి సంఘం ప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమలో పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రాధాన్యత

### సిద్దిపేటలో బస్తీ దవాఖాన ప్రారంభించిన మంత్రి హరీష్ రావు



**సిద్ధిపేట, జూన్ 10 (సమ సమాజం):** ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశ, ఏఎన్ఎంలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు సూచించారు. ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లకుండా ప్రభుత్వ దవాఖానలోనే వైద్య సేవలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. సిద్ధిపేట లోని కేసీఆర్ నగర్‌లో బస్తీ దవాఖాన నూతన భవనాన్ని శుక్రవారం మంత్రి హరీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ లో భాగంగా పట్టణాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజల ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అనటానికి నిదర్శనం బస్తీ దవాఖానల ఏర్పాటేనని అన్నారు. కేసీఆర్ నగర్‌లో గతంలో తాత్కాలిక భవనంలో బస్తీ దవాఖాన సేవలు అందుబాటులో ఉండేవని. రూ.18 లక్షలతో ఇటీవలే పక్కా భవనం నిర్మాణం చేపట్టామన్నారు. దీంతో ఇక్కడి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయని మంత్రి స్పష్టం చేశారు. బస్తీ దవాఖానాల్లో అవుట్ పేషెంట్సేవలు అందించడం పాటు బీపీ, షుగర్‌తో సహా 57 రకాల వైద్య పరీక్షలను చేస్తారని తెలిపారు. సుమారు 150 రకాల మందులను ఉచితంగా అందిస్తారని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్వల్పంగా అనారోగ్యం బారిన పడిన వారికి తక్షణ వైద్య చికిత్స అందించడంతో పాటు టీకాలు, కుటుంబ నియంత్రణ, వైద్య పరమైన కౌన్సిలింగ్ ఇస్తారని తెలిపారు.

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభించిన కేటిఆర్



**జగిత్యాల, జూన్ 10 (సమ సమాజం):** మంత్రి కేటీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటిస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గం మెట్‌పల్లిలో నిర్మించిన 110 డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించారు. లబ్దిదారులతో గృహ ప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు పాల్గొన్నారు. అనంతరం మెట్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు.

## మంత్రులు, ఎంపీలతో సీఎం కేసీఆర్ సమావేశం



**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, విప్‌లు, ఫ్లోర్ లీడర్లతో సీఎం కేసీఆర్ సమావేశమయ్యారు. ప్రగతి భవన్‌లో జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా పరిణామాలు, రాజకీయ, పాలనాపరమైన అంశాలపై చర్చించారు. రాష్ట్రపతి ఎన్నికపైనా కూడా చర్చించినట్టు తెలుస్తోంది.

## పట్టణ సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్లే కీలకం : మంత్రి




**మహబూబ్‌నగర్, జూన్ 10 (సమ సమాజం):** మున్సిపల్ కౌన్సిలర్లు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా హౌసింగ్ బోర్డ్ కాలనీలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కౌన్సిలర్లు ప్రజలమధ్య ఉన్నప్పుడే వారి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ముఖ్యంగా ప్రతిరోజు వార్డుల్లో పర్యటించి తాగునీరు, పారిశుద్ధ్యం, వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని వారందరికి దశలవారీగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తుందని, ఒకవేళ ఎవరికైనా సొంత స్థలం ఉంటే ఇల్లు కట్టుకునేందుకు సహకారం ఇస్తామని తెలిపారు.రిత్త పెన్షన్లు కూడా త్వరలోనే మంజూరు చేస్తామని వెల్లడించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ కె సి నరసింహులు, డీసీసీబీ ఉపాధ్యక్షుడు కోరమోని వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ తాటి గణెళిష్, కౌన్సిలర్లు యాదమ్మ, వనజ, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలోఉన్నారు.

## జిట్టా బాలకృష్ణారెడ్డికి బెయిల్

**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** : బీజేపీ నేత జిల్లా బాలకృష్ణారెడ్డికి రంగారెడ్డి జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సీఎం కేసీఆర్‌ను కించపరిచారనే కేసులో గురువారం రాత్రి జిట్టా బాలకృష్ణారెడ్డిని అరెస్టు చేశారు. ఈ నెల 2న అమరుల యాదిలో ఉద్యమ ఆకాంక్షల సాధన సభలో జిట్టా ముఖ్యమంత్రి కేసీఆర్ ని కించపరిచేలా డ్రామా వేయించారని టీఆర్ఎస్ నేతలు హయత్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆయన్నిగురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తీరుపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బీజేపీ నేతలు తప్పడు ప్రచారాలు మానుకోండి: ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** మహిళా సాధికారతపై బీజేపీ నాయకులు చేస్తున్న ప్రచారంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాలను ఆశించి, మహిళా సాధికారతపై నిజాలను దాచిపెట్టి చేస్తున్నతప్పుడు ప్రచారాలను ప్రధాని మోడీ సహా బీజేపీ నేతలు, మంత్రులు తక్షణమే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ దిగువ మధ్యతరగతి మహిళలను నేరుగా ప్రభావితం చేస్తున్న ధరల పెరుగుదలను నియంత్రించడంలో బీజేపీ సర్కార్ తీవ్ర వైఫల్యం చెందిందని ఆమె మండిపడ్డారు. అంగన్ వాడీ సోదరీమణులు కరోనా నుంచి గ్రామాలను రక్షించడంతో పాటు తల్లీబిడ్డల పోషకాహార స్థాయిని పెంచడంలో తీవ్రంగా కృషి చేస్తున్నారని తెలిపారు. అలాంటి అంగన్ వాడీలకు బ్జడెట్ ని 50 శాతం తగ్గించిన బీజేపీ ప్రభుత్వం అంగన్ వాడీ సోదరీమణులకు క్షమాపణలు చెప్పాలన్నారు.


## పేరునైనా సరి చేయండి.. బోర్డునైనా పీకేయండి!




**టేక్మాల్, జూన్ 10 (సమ సమాజం):** టేక్మాల్ మండలం దాదాయిపల్లి గ్రామానికి అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ చౌరస్తా నుంచి వెళ్లాల్సి ఉంటుంది. చౌరస్తాకు ముందు జాతీయ రహదారిపై అండర్ పాస్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డుపై దాదాయిపల్లికి బదులుగా దండెపల్లి అని రాశారు. దీంతో కొత్తగా గ్రామానికి వచ్చేవారు గందరగోళానికి గురువుతున్నారు. దారి తప్పి రాంగ్ రూట్లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అల్లాదుర్గం ప్రాణాలు తీస్తున్న 'రాంగ్ రూట్' హైవే 161 పై స్పష్టత లేని సూచిక బోర్డులు.. నిత్యకృత్యమైన ప్రమాదాలు! గ్రామాలకు దూరంగా సర్వీసు రోడ్లు ఆ రాంగ్రూట్ ప్రయాణాలతోనే అత్యధిక ప్రమాదాలు ్న అవగాహన కల్పించని అధికారులు నాందేడ్ – హైదరాబాద్ జాతీయ రహదారి జాతీయ రహదారి ఏర్పాటైతే సుఖవంతమైన ప్రయాణం. చేయవచ్చని ప్రజలు భావించినా... అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడా జాతీయ రహదారిపై వాహనచోధకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణాలతో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఫలితంగా నాందేడ్ – హైదరాబాద్ 161 జాతీయ రహదారిపై చేయడానికి జనం భయపడుతున్నారు. నారాయణఖేడ్, జూన్ 10 నాందేడ్ హైదరాబాద్ రహదారి ఎన్ఎన్ఎ రోడ్డు ఉండడంతో ఆ రూట్లో వెళ్లాలంటేనే వాహనదారులు ఇబ్బందిగా.. భావించేవారు. అయితే కేంద్రం ఆ రోడ్డును జాతీయ రహదారి 161గా ప్రక టించింది. నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించడం కోసం సంగారెడ్డి నుంచి మహా రాష్ట్ర సరిహద్దు వరకు మూడు భాగాలుగా విభజించారు. మొదటి దశలో రంసాన్పల్లి నుంచి మంగ్లూర్ వరకు, అక్కడి నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రంసాన్ పల్లి నుంచి సంగారెడ్డి వరకు విస్తరణ పనులు సాగుతున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్నా. జాతీయ రహదారిని నిర్మించినప్పటికీ సర్వీసు రోడ్లను గ్రామాలకు దగ్గరగా ఏర్పాటు చేయలేదు. ఆయా సర్వీసు రహదారుల గుండా ఏయే గ్రామాలకు వెళ్లే సౌలభ్యం ఉంటుందనే బోర్డులు కూడా లేవు. నారాయణఖేడ్ మండలం. నిజాంపేట సమీపంలోని జంబికుంటకు వెళ్లాలంటే మూడు కిలోమీటర్ల దూరం ఉండే సర్వీసు రోడ్డు నుంచి వెళ్లాల్సి ఉంటుంది. శంకర్ పేట వైపు నుంచి నారాయణడ్ వైపు రావడానికి రెండు కిలో మీటర్ల దూరం. సర్వీసు రోడ్డు ప్రయాణం చేయాల్సి వస్తుంది. అల్లాదుర్గానికి రావాలన్న, చిల్వేర సమీపంలో ఉన్న సర్వీసు రోడ్డు గుండా రావాల్సి వస్తుంది. అల్లా దుర్గం ఐబీ నుంచి మెటల్ కుంట రోడ్డు గుండా ప్రయాణం చేసేవారు. కూడా ఈ సర్వీసు రోడ్డు నుంచే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. బోర్డులు స్పష్టంగా ఏర్పాటు చేయకపోవడంతో వాహన చోదకులు ఏ మాత్రం నిర్ల క్యంగా ఉన్నా కిలోమీటర్ల దూరం వృధా ప్రయాణం చేయాల్సి వస్తుంది. యూటర్న్ కూడా అందుబాటులో లేవు. కొందరు వాహనచోదకులు. రాంగ్రూట్లో ప్రయాణిస్తున్నారు. రాంగ్రూట్లో ప్రయాణించడం వల్ల నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మంగూర్, రంసాన్పల్లి –పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 63 ప్రమాదాలు చోటుచేసుకు ఉన్నాయి. మార్చి నుంచి మే వరకు జరిగిన మూడు పెద్ద ప్రమాదాల్లో 8. మంది మృతి చెందారు. అన వరిలో నాలుగు ప్రమాదాలు, ఫిబ్రవరిలో 12, మార్చిలో 12 ఏప్రిల్ 19, మే 16 ప్రమాదాలు చోటుచేసుకు న్నాయి. జాతీయ రహదారి. అందుబాటులోకి రావడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని జాతీయ రహదారుల ప్రాజెక్టు హెడ్ ప్రకటించినా తూతూమంత్రంగా అవగాహన కల్పించి చేతులు దులుపుకున్నారు.

## అన్ని మతాల పండగలను

# మేమే నిర్వహిస్తున్నాం-మంత్రి ఎర్రబెల్లి



**జనగామ, జూన్ 10 (సమ సమాజం):** రాష్ట్రంలో అన్నిమతాల పండుగలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను కూడా ప్రభుత్వమే నిర్వహిస్తున్నదని ఆయన చెప్పారు. జనగామ జిల్లాలోని పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామంలో 'సద్గురు సేవా సత్సంగ్ మందిరం కమ్యూనిటీ హాల్'ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల పండుగలను ప్రభుత్వమే చేసే గొప్ప సంస్కృతిని సీఎం కేసీఆర్ మొదలు పెట్టిన విషయాన్ని గుర్తు చేశఆరు. అదే సమయంలో బీజేపీ మత తత్వాన్ని పెంచి పోషిస్తూ కలిసి ఉండే ప్రజల మధ్య విషం చిమ్ముతూ విద్వేషాన్ని పెంచుతున్నదని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండిపడ్డారు. బతుకమ్మ, క్రిస్మస్, రంజాన్ పండుగలకు ప్రభుత్వం బట్టలు పెట్టి ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. అన్ని మతాలను గౌరవించాలని చెప్పిన రాజ్యాంగాన్ని సీఎం కేసీఆర్ గౌరవించి, ఆ గౌరవాన్ని మరింత పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను విడదీసి పాలిస్తున్నదని ఎర్రబెల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని ఆలోచించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస రావు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, మల్లంపల్లి సర్పంచ్ గిరగాని హేమలత, కొడకండ్ల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సమ్మిళిత అభివృద్ధి

### ప్రైవేటు రంగంలో భారీగా పెట్టుబడులు-మంత్రి కేటీఆర్



**జగిత్యాల, జూన్ 10 (సమ సమాజం):** దేశానికి అతిపెద్ద శక్తి యువతరమని రాష్ట్ర మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రైవేటు రంగంలో తెలంగాణలో 19 వేల పరిశ్రమలు పెట్టుబడులు పెడుతున్నాయని ఆయన తెలిపారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో నిరుద్యోగ యువతకోసం ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్‌ను మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నీళ్లు, నిధులు, నియామకాల కోసమని తెలిపారు. ఉద్యమ నినాదానికి అనుగుణంగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. చదివిన చదువు ఏనాటికీ వృథా కాదని, కష్టపడితే ఉద్యోగం సంపాదించడం సులువేనని రాష్ట్ర మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 1.32 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ప్రస్తుతం 90 వేల ఉద్యోగాల నియామక పక్రియను చేపట్టామని తెలిపారు. 95 శాతం స్థానిక అభ్యర్థులకే ఉద్యోగాలు వచ్చేలా సీఎం కేసీఆర్ కృషి చేశారని వెల్లడించారు. రాష్ట్రం సమ్మిళిత అభివృద్ధి సాధిస్తున్నదని మంత్రి చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల మాదిరిగా దూసుకెళ్తున్నాయని తెలిపారు. ఓ వైపు పర్యావరణం, మరో వైపు పరిశ్రమలు పెరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. తెలంగాణలో వచ్చిన నిధులను రాష్ట్రంలోనే ఖర్చు పెడుతున్నామని తెలిపారు. ఆర్బీఐ లెక్కల ప్రకారం దేశాన్ని నడుపుతున్న నాలుగో రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. నీళ్ల విషయంలో దేశంలో 75 ఏండ్లలో జరగని పురోగతిని రాష్ట్రంలో సాధించిందన్నారు. రూ.45 వేల కోట్లు ఖర్చుచేసి ఇంటింటికి మంచినీరు అందిస్తున్నామని చెప్పారు. మండు వేసవిలో కూడా కాలువల్లో నీరు ప్రవహిస్తున్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం తెలంగాణలో ఉందని, లాజర్గస్ట్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని గూగుల్ కొడితే కాళేశ్వరం అని వస్తుందని చెప్పారు. నాలుగేండ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిచేసిన సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1964లో ఎస్సారెస్పీకి అప్పటి ప్రధాని నెహ్రూ కొబ్బరికాయ కొడితే మొన్నటిదాకా కాల్వలు తవ్వారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 82 మీటర్ల నుంచి 600 మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సాగర్‌లో నీళ్లు ఎత్తిపోస్తున్నామని మంత్రి అన్నారు. 90 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే అద్భుతమైన ప్రాజెక్టు కాళేశ్వరమని ప్రకటించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇంటింటికి మంచి నీరు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అనుమతినిచ్చామని మంత్రి కేటీఆర్ వివరించారు. ఇందులో భాగంగా ధాత్రి, భువి కంపెనీలు ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి ఆహ్వానిస్తున్నామన్నారు.

# కోల్‌కతాలో ఊహించని దారుణం

**కోల్‌కతా, జూన్ 10 (సమ సమాజం):** డిప్రెషన్‌కి గురైన ఓ పోలీస్ ఆత్మహత్య చేసుకుందామని తుపాకీని తనవైపుకి తిప్పుకునేలోపే ఊహించని దారుణం చోటు చేసుకుంది. కోల్‌కతాలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వెలుపల సాయుధ బలగాలకు చెందిన ఒక కానిస్టేబుల్ అకస్మాత్తుగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో మహిళతో సహా ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఐతే తుడుప్ లెప్చా అనే కానిస్టేబుల్ ఒక గంట పాటు ఆ ప్రాంతంలో సంచరిస్తూ, అకస్మాత్తుగా కాల్పులు జరిపాడని, ఆ తర్వాత తుపాకీని తనవైపుకి తిప్పుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు అధికారులు కూడా సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్ నుంచే ఈ కాల్పులు జరిగాయని వెల్లడించారు. పైగా లెప్చా కోల్‌కతా సాయుధ పోలీసుల 5వ బెటాలియన్‌కు చెందినవాడని, బంగ్లాదేశ్ హైకమిషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నడాని చెప్పారు. మొన్నటిదాక సెలవుల్లో ఉన్న ఆయన ఈ ఉదయమే విధుల్లోకి చేరాడని, పైగా డిప్రెషన్‌తో గత కొంతకాలంగా బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో కానిస్టేబుల్, మరో ఇద్దరు మృతి చెందారని చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఢిల్లీ జామా మసీద్ వద్ద ఉద్రిక్తత




**ఢిల్లీ, జూన్ 10 (సమ సమాజం):** బీజేపీ మాజీ నేతలు నూపుర్ శర్మ, నవీన్ జిందాల్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన ప్రదర్శనలతో ఢిల్లీ జామా మసీద్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. శుక్రవారం నమాజ్ ముగిసిన వెంటనే వందల మంది మసీద్ బయట బీజేపీ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. దాంతో మసీద్ బయట కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చిన్నపిల్లలతో సహా వందల మంది నూపుర్‌కు వ్యతిరేకంగా నినదించారు. ఇక ఈ నిరసనలకు తమకు ఎలాంటి సంబంధం లేదని జామా మసీద్ నిర్వాహకులు తెలిపారు. బహుశా వాళ్లంతా ఎంఐఎంకు చెందిన వాళ్లయ్యుండొచ్చని, అలాంటి నిరసనలకు తమ మద్దతు ఎప్పుడూ ఉండబోదని మసీద్ నిర్వాహక కమిటీ స్పష్టం చేసింది. జామా మసీద్‌తో పాటు యూపీ, సహారన్‌పూర్, మోరాదాబాద్ మసీదుల బయట కూడా శుక్రవారం ప్రార్థనల తర్వాత నూపుర్ కామెంట్లపై నిరసన పరిస్థితులు కనిపించాయి. హైదరాబాద్‌లోనూ ఇదే తరహా వాతావరణం కనిపిస్తోంది.

# అమెరికాలో రెండు కాళ్లతో వింత జీవి కలకలం

టెక్సాస్ : భూమి మీద మనిషి కంటికి కనిపించని ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో వాటిని చూసి నిజమేనా అని షాక్ అవుతుంటాము. తాజాగా అలాంటి ఘటనే ఒకటి అమెరికాలో వెలుగు చూసింది. టెక్సాస్‌లోని అమారిలో పట్టణంలో ఓ వింత జీవి ఫొటో అక్కడున్న వారిని కలవారపాటుకు గురిచేస్తోంది. టెక్సాస్‌లోని ఒక 'జూ'లో మే 21వ తేదీన అర్ధరాత్రి 1:25 సమయంలో రెండుకాళ్లపై ఓ జీవి నిలబడి ఉంది. ఈ క్రమంలో జూలో ఉన్న సెక్యూరిటీ కెమెరాలో ఇది రికార్డు అయ్యింది. అయితే, ఆ జీవి జూ అవతల ఫెన్సింగ్ దగ్గర ఉన్నట్టు సిబ్బంది గుర్తించారు. ఆ తర్వాత ఈ ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలకు భయాందోళనకు గురవుతున్నారు. ఇక, ఈ ఫొటో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలవడంతో ఫొటోపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. అది నిజంగా వింత జీవేనా? లేక ఎవరైనా మనుషులే అలాంటి గెటప్‌లో వచ్చారా? అని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు దీనిని జూ అధికారులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసుల చేతికి బాలిక గ్యాంగ్‌రేప్ మెడికల్ రిపోర్ట్

**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** జూబ్లీహిల్స్‌లో బాలికపై గ్యాంగ్‌రేప్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. జూబ్లీహిల్స్ పోలీసులకు అందిన మెడికల్ రిపోర్టు ద్వారా సంచలన విషయాలు తెలిశాయి. నిందితులు బాలికపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఇన్నోవా వాహనంలో ఆమె పట్ల అత్యంత అసభ్యంగా ప్రవర్తించారు. నిరాకరించటంతో బాలికను గోళ్లతో రక్కారు. ఆమె శరీరంపై 12 తీవ్రగాయాలున్నట్లు వైద్యుల నిర్ధారించారు. బాలికపై సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు ఇప్పటివరకు సాదుద్దీన్ సహా.. ఐదుగురు మైనర్లను అరెస్టు చేశారు. వారిలో ఐదుగురు అత్యాచారానికి పాల్పడ్డారని, ఒక మైనర్ పాత్ర కేవలం సహకారం వరకేనని పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు(ఏ1)గా ఉన్న సాదుద్దీన్ మలిక్‌ను పోలీసులు గురువారం ఉదయం కస్టడీకి తీసుకున్నారు. అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్ధికీ, బంజారాహిల్స్ ఏసీపీ సుదర్శన్ అతణ్ని 5 గంటల పాటు ప్రశ్నించారు. సాదుద్దీన్ తొలుత తాము బేకరీ వరకు వెళ్లి.. పబ్‌కు తిరిగివచ్చామంటూ తికమకపెట్టేందుకు ప్రయత్నించాడు. సాదుద్దీన్‌ను 2వ రోజు పోలీసులు విచారిస్తోన్నారు. జువైనల్ హోంలో మైనర్లను విచారించి పోలీసులు వారి స్టేట్మెంట్‌ను రికార్డ్ చేయనున్నారు.

## ఉమ్మడి రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై సోనియా కసరత్తు

**న్యూఢిల్లీ, జూన్ 10 (సమ సమాజం):** త్వరలో జరగనున్న రాష్ట్రపతి ఎన్నికలలో ప్రతిపక్షాల తరపున ఉమ్మడి అభ్యర్థిని బరిలో దింపేందుకు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రయత్నలు ప్రారంభించారు. డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, సీపీఎం నేత సీతారాం ఏచూరీ సహా పలువురు విపక్ష నేతలతో సంప్రదింపులు జరిపేందుకు సిద్ధమవుతున్నారు. తదుపరి భారత రాష్ట్రపతి అభ్యర్థిగా ఎవరిని బరిలో దింపాలనే విషయంలో విపక్ష నేతలతో చర్చించడంతో పాటు వారి మనోగతం తెలుసుకునే బాధ్యతను రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు అప్పగించారామె. ఎన్డీయేతర, యూపీయేతర పక్షాలతోనూ మంతనాలు జరపాలని ఖర్గేను సోనియా ఆదేశించినట్టు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఖర్గే విపక్ష నేతలతో చర్చించి రాష్ట్రపతి అభ్యర్థులుగా ఎవరి పేర్లను పరిశీలించాలనే దానిపై కసరత్తు సాగిస్తారు. కాగా రాష్ట్రపతి ఎన్నికకు ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్ ప్రకటించింది. జులై 18న రాష్ట్రపతి ఎన్నికలు జరగనుండగా జులై 21న ఫలితాలు ప్రకటిస్తారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పదవీకాలం జులై 24తో ముగియనుంది. ఎన్నికల్లో 4809 మంది ఓటు హక్కును వినియోగించుకుంటారు.

# చార్మినార్ వద్ద ముస్లింల ఆందోళన




**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** బీజేపీ మాజీ నేతలు నుపూర్ శర్మ, నవీన్ జిందాల్ మహ్మద్ ప్రవక్తపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా కలకలం సృష్టిస్తున్నాయి. శుక్రవారం దేశవ్యాప్తంగా ముస్లిం సంఘాలు ఆందోళనలకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. శుక్రవారం ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లింలు ఆందోళనకు దిగారు. మహ్మద్ ప్రవక్తపై మాజీ బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలపై బీజేపీకి వ్యతిరేకంగా ముస్లిం సంఘాలు నినాదాలు చేస్తూ మక్కా మసీద్ నుంచి చార్మినార్ వరకు ర్యాలీ తీశాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా చార్మినార్ వద్ద పోలీసు బలగాలు భారీ సంఖ్యలో మోహరించాయి.

# రూపాయి మారకంలో వాణిజ్యంపై కసరత్తు

**ముంబై, జూన్ 10 (సమ సమాజం):** ఇరు దేశాల మధ్య వాణిజ్య లావాదేవీలను రూపాయి మారకంలో లేదా వస్తు మార్పిడి రూపంలో నిర్వహించే అవకాశాలను భారత్, ఇరాన్ పరిశీలించాయి. అలాగే, నిర్దిష్ట బ్యాంకింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసే అంశంపైనా చర్చించాయి. మూడు రోజుల పాటు భారత పర్యటనకు వచ్చిన ఇరాన్ విదేశాంగ మంత్రి హొళసేన్ అమిర్ అబ్దుల్లాహియాన్ ఈ విషయాలు తెలిపారు. భారత్ తోడ్పాటుతో అభివృద్ధి చేస్తున్న చాబహార్ పోర్టులో పెట్టుబడులను పెంచే అంశం కూడా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జై శంకర్‌తో భేటీలో చర్చకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. అమెరికా ఏకపక్షంగా ఆంక్షలు విధించినప్పటికీ భారత్, ఇరాన్‌లకు పుష్కలమైన వ్యాపార అవకాశాలు ఉన్నాయని హొళసేన్ తెలిపారు.

# గణేశ్ విగ్రహ తయారీకి అంకురార్పణ

### తయారీని ప్రారంభించిన ఉత్సవ నిర్వాహకులు


**హైదరాబాద్, జూన్ 10 (సమ సమాజం):** ఖైరతాబాద్ గణెళిశ్ విగ్రహ తయారీకి అంకురార్పణ చేశారు. కర్రపూజతో విగ్రహ తయారీని ఉత్సవ నిర్వాహకులు ప్రారంభించారు. ఈ ఏడాది పంచముఖ లక్ష్మీవినాయక అవతారంలో ఖైరతాబాద్ గణెళిష్ కొలువు తీరనున్నారు. ఈ సారి 50 అడుగుల గణెళిశుడి మట్టి విగ్రహం తయారీకి శ్రీకారం చుట్టారు. పీవోపీ విగ్రహాలపై ఆంక్షలతో గణెళిశుడి విగ్రహం ఎత్తును నిర్వాహకులు కుదించారు. కర్రపూజలో ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈసారి ఖైరతాబాద్ మహా గణపతిని మట్టితోనే 50 అడుగుల మేర రూపొందించనున్నారు. శుక్రవారం నిర్జల ఏకాదశి సందర్భంగా ఖైరతాబాద్ మండపం వద్ద కర్ర పూజ నిర్వహించారు. మట్టి మహాగణపతి నిమజ్జనం ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయవచ్చని, ఆ సమయంలో నిరాటంకంగా 4 గంటల పాటు వర్షం వచ్చినా ఎలాంటి సమస్య ఉండదని శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్ తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి సుదర్శన్, కన్వీనర్ సందీప్ రాజ్, ఆర్గనైజర్ సింగరి రాజ్‌కుమార్, వైస్ ప్రసిడెంట్ మహేష్‌యాదవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. వినాయక చవితి ఉత్సవాలు సాఫీగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ గణెళిశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్ రావు కోరారు. విగ్రహాలు పెద్దగా తయారు చేయవద్దని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో పోలీసులు గణెళిశ్ విగ్రహాల తయారీదారులను వేధిస్తున్నారన్నారు. ఏడాది పొడవునా కేవలం విగ్రహాల తయారీపైనే ఆధారపడి జీవిస్తారని, అలాంటి వారిపై వేధింపులకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు రామరాజు, భాగ్యనగర్ గణెళిశ్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు కరోడిని మాలి, కార్యదర్శులు బుచ్చిరెడ్డి, మహేందర్, శశిధర్ తదితరులు మాట్లాడారు. పదేళ్లుగా గణెళిశ్ ఉత్సవాలపై వివాదం సృష్టిస్తున్నారని, హిందూ పండుగలను అణచివేస్తే సహించబోమని హెచ్చరించారు. ఉత్సవాలు ఎలా జరుపుకోవాలనే విషయమై హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రభుత్వం ఆ ఉత్తర్వులకు అనుగుణంగా నిమజ్జనం చేయనీయడం లేదని తెలిపారు. దీనిపై తాము కోర్టు ధిక్కరణ కేసు వేశామని, కానీ ప్రభుత్వం కోర్టుకు హాజరుకావడం లేదని చెప్పారు. ఈనెల 24న మరోమారు కోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం పూర్తి నివేదిక సమర్పించాలని కోరారు.

# ఆగస్ట్ 2న ఢిల్లీలో రేషన్ డీలర్ల పార్లమెంట్ మార్చ్

**న్యూఢిల్లీ, జూన్ 10 (సమ సమాజం):** రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టనున్నట్లు జాతీయ రేషన్ డీలర్ల ఫెడరేషన్ ప్రకటించింది. గురువారం ఢిల్లీలో జరిగిన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'వన్ నేషన్ వన్ కమిషన్' విధానంలో ప్రతి క్వింటాల్‌కు కమిషన్‌ను రూ.250 నుంచి రూ.300కు పెంచాలని ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం జూలై 4న మండల కేంద్రాల్లో, జూలై 11న జిల్లా కేంద్రాల్లో, జూలై 18న రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధానుల్లో ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్ట్ 2న దేశవ్యాప్తంగా ఉన్న ఐదు లక్షల మంది డీలర్లతో ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించనున్నట్లు రాజు పేర్కొన్నారు.




# చలన చిత్రం



## మాడవీధుల్లో చెప్పులేసుకుని తిరిగిన నయనతార



గురువారం వివాహం చేసుకున్న అనంతరం నయనతార– విఘ్నేశ్ శివన్‌లు స్వామి వారి ఆశీస్సులు తీసుకునేందుకు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ క్రమంలో నయనతార కొత్త వివాదంలో చిక్కుకుంది. గుడి ప్రాంగణంలో ఆమె చెప్పులు వేసుకుని తిరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. స్వామివారు కొలువు తీరిన ప్రాంతంలో ఉన్న మాడవీధుల్లో ఎంతో పవిత్రమైనవి. ఇలాంటి పవిత్రమైన ప్రదేశంలో ఇవేం పనులు అంటూ నయన్‌పై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫొటోషూట్‌కు తిరుమల ఆలయం వేదికనుకుంటున్నారా అంటూ నెటిజన్లు ఫైరవుతున్నారు. వెంటనే చేసిన తప్పు తెలుసుకుని స్వామివారిని క్షమాపణ కోరండని సూచిస్తున్నారు.

## ఆకట్టుకుంటున్న బాలకృష్ణ న్యూమూవీ టీజర్

బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతున్నది. బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఫస్ట్‌హంట్‌ను (టీజర్) విడుదల చేశారు. ఇందులో సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌తో శక్తివంతంగా కనిపిస్తున్నారు బాలకృష్ణ. 'నీ జీవో గవర్నమెంట్ ఆర్డర్..నా జీవో గాడ్స్ ఆర్డర్..భయం నా బయోడేటాలోనే లేదు' వంటి సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. యాక్షన్, మాస్ అంశాలతో టీజర్‌ను తీర్చిదిద్దారు. పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రం అభిమానులకు పండగలా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో శృతిహాసన్ కథానాయికగా నటిస్తున్నది. కన్నడ నటుడు దునియా విజయ్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. వరలక్ష్మి శరత్‌కుమార్, చంద్రిక రవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రిషి పంజాబి, సంగీతం: తమన్, ఎడిటర్: నవీన్ నూలి, ÷ట్స్: రామ్‌లక్ష్మణ్, సీఈఓ: చెర్రీ, ప్రొడక్షన్ డిజైనర్: ఏఎస్ ప్రకాష్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: చందు రావిపాటి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం:గోపీచంద్ మలినేని.



## డిసెంబర్‌లో 'దసరా' రిలీజ్..?

నేచురల్ స్టార్ నాని ఊరమాస్ గెటప్‌లో కనిపించబోతున్న లేటెస్ట్ మూవీ 'దసరా'. తాజాగా ఈ సినిమా విడుదలకు సంబంధించిన న్యూస్ ఒకటి వచ్చి నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఈరోజే 'అంటే సుందరానికీ' అనే కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు నాని. ఈ సినిమాకు ప్రస్తుతం సూపర్ హిట్ టాక్ వినిపిస్తోంది. మలయాళం స్టార్ హీరోయిన్ నజ్రియా నజీమ్ ఈ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహించగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిచారు.అయితే, 'దసరా' షూటింగ్ మొదలయ్యాక కొంత టాకీ పార్ట్ పూర్తి చేసిన నాని, 'అంటే సుందరానికీ' సినిమా ప్రమోషన్స్ కారణంగా కాస్త బ్రేక్ ఇచ్చాడు. దాంతో ముందునుంచి ఈ మూవీని దసరా బరిలో దింపాలనుకుంటే ఇప్పుడు అది సాధ్యపడేలా లేదని తెలుస్తోంది. శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్న ఈ చిత్రం కంప్లీట్ మాస్ ఎలిమెంట్స్‌లో నిర్మిస్తున్నారు. ఇందులో నాని సరసన కీర్తి సురేశ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక 'దసరా' నాని కెరీర్‌లో ఫస్ట్ పాన్ ఇండియా సినిమా కావడం విశేషం.కాగా, త్వరలో నాని మళ్ళీ 'దసరా' సినిమా షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. వీలైంత త్వరగా చిత్రాన్ని పూర్తి చేసి గత ఏడాది 'శ్యామ్ సింగరాయ్' సినిమాను రిలీజ్ చేసినట్టుగానే క్రిస్మస్ కానుకగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో రిలీజ్ చేయనున్నారట. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఎస్ ఎల్ వి బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మరి నాని కెరీర్‌లో ఫస్ట్ పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుస్తున్న 'దసరా' పాన్ ఇండియన్ స్టార్‌గా ఏమేరకు క్రేజ్ తీసుకువస్తుందో చూడాలి

## జులై 15న 'గుర్తుందా శీతాకాలం' రిలీజ్

టాలెంటెడ్ హీరో సత్యదేవ్, మిల్కీ బ్యూటీ తమన్నా జంటగా నటించిన సినిమా 'గుర్తుందా శీతాకాలం'. డైరెక్టర్ నాగ శేకర్ ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రతీ ఒక్కరు తమ జీవితంలో సెటిల్ అయిన తర్వాత కొన్ని విషయాల్ని ఎప్పటికీ మరిచిపోరు. ముఖ్యంగా టీనేజ్, కాలేజ్ ఆ తర్వాత వచ్చే యూత్ లైఫ్‌లో జరిగే సంఘటనలు జీవితాంతం గుర్తుకు వస్తూనే ఉంటాయి. ఇలాంటి ఆసక్తికరమైన సంఘటణల ఆధారంగానే 'గుర్తుందా శీతాకాలం' చిత్రం రూపొందిస్తున్నారు. నాగశేఖర్ మూవీస్ బ్యానర్, మణికంఠ ఎంటర్‌టైన్మెంట్స్, వేదాక్షర ఫిల్మ్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని భావన రవి, నాగశేఖర్, రామారావు చింతపల్లి, ఎమ్ ఎస్ రెడ్డి, చినబాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.మేఘా ఆకాష్, కావ్యశెట్టి తదితరులు ఈ సినిమాలో ఇతర కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. కన్నడలో వచ్చి సూపర్ హిట్ అయిన 'లవ్ మాక్‌టైల్' మూవీ ఆధారంగా 'గుర్తుందా శీతాకాలం' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ సాంగ్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. కాగా, సినిమాను జులై 15న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా మేకర్స్ ప్రకటించారు. ఈ మధ్యకాలంలో సరైన హిట్ అందుకోలేని తమన్నా.. 'గుర్తుందా శీతాకాలం'తో మంచి హిట్ దక్కుతుందనే నమ్మకంతో ఉంది.ఇక హీరో సత్యదేవ్ నటించిన తాజా చిత్రం 'గాడ్సే' ఈ నెల 17న గ్రాండ్‌గా రిలీజ్ అవుతుంది. ఇంతకముందు సత్యదేవ్, గోపి గణెళిష్ కాంబినేషన్‌లో వచ్చిన 'బ్లఫ్ మాస్టర్' సూపర్ హిట్‌గా నిలిచింది. దాంతో ఇప్పుడు ఇదే కాంబినేషన్‌లో రాబోతున్న 'గాడ్సే' మూవీపై బాగానే అంచనాలు ఏర్పడ్డాయి. ఇలా హీరోగా వరుసగా సినిమాలు చేస్తున్న సత్యదేవ్ మరోవైపు తమిళ హీరోలకు డబ్బింగ్ చెబుతున్నారు. అలాగే, 'గాడ్ ఫాదర్' లాంటి చిత్రాలలోనూ కీలక పాత్రల్లో నటించడానికి రెడీగా ఉంటున్నాడు.




Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in